ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

టూరిజం హబ్‌గా తిరుపతి

మంత్రి కందుల దుర్గేశ్

చంద్రగిరి/తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హోటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టుడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్.రోప్‌వే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్కు దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హోటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



పర్యాటక శాఖ అధికారులతో మంత్రి దుర్గేశ్ సమీక్ష



ముక్కంటి సన్నిధిలో

అమరావతి రైతులు

శ్రీకాళహస్తి, జూలై 5 : అమరావతి రైతులు . శుక్రవారం ముక్కంటీశుడిని దర్శించుకున్నారు. ఆలయంలోని పొగడచెట్టు వద్ద కాసేపు శివమనామ స్మరణ చేశారు.రాజధానిగా అమరావతే వుండాలంటూ 2021వ సంవత్సరం డిసెంబరు నెలలో 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' నినాదంతో అమరావతి రైతులు పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు.ఎన్నికల్లో చంద్రబాబు గెలుపుతో రాజధానిగా అమరావతే వుండాలన్న తమ సంకల్పం సఫలీకృతం కావడంతో ముక్కంటి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారిని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి తమ ఇంటికి ఆహ్వానించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని బొజ్జల స్వగృహంలో రాజధాని రైతులు శుక్రవారం రాత్రి ఆతిధ్యం స్వీకరించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ గత సీఎం జగన్ తమను దారుణంగా వేధించారని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాదయాత్ర జరిగిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి తమ పట్ల అమానుషంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అకారణంగా అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. పాదయాత్రలో భాగంగా బస చేసేందుకు అవకాశం ఇచ్చిన వారిని కూడా వెంటాడి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు.అప్పట్లో బొజ్జల కుటుంబంతో పాటు టీడీపీ నేతలు ఎంతగానో సహకరించారన్నారు. అనంతరం మహిళా రైతులను బొజ్జల రిషితారెడ్డి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి పసుపు, కుంకుమ, చీరసారె అందజేశారు. మగవారికి పంచె, కండువా సమర్పించారు. టీడీపీ నాయకుడు మునిరాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న

విజిలెన్స్ తనిఖీలు

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిరుమలలో తనిఖీలు కొనసాగిస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన క్రమంలో రెండువారాలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు టీటీడీలోని పలు విభాగాల్లో సోదాలు చేస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, బదిలీపై వెళ్లిన అధికారులు, వారి వివరాలను సేకరించడంతో పాటు నిధులను ఎక్కడ, ఎలా వినియోగించారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. తాజాగా, గురువారం ఎస్టేట్ విభాగంతో పాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించే ఈవో కార్యాలయంలోనూ సోదాలు చేసినట్టు సమాచారం. ఈవో కార్యాలయంలోని ఇద్దరు ముఖ్యమైన అధికారులను ప్రశ్నించి స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిసింది. వీఐపీ బ్రేక్ టికెట్లు ఎలా కేటాయిస్తున్నారు, ఎవరికి కేటాయిస్తున్నారు, కేటాయింపుల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో విచారించినట్టు తెలిసింది. ఇక, తిరుపతిలోనూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో శుక్రవారం సోదాలు చేసి పలు రికార్డులు తీసుకున్నట్టు సమాచారం.మరో రెండుమూడువారాల పాటు సోదాలు జరగనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ ఫైళ్ల దహనం..!

పుంగనూరు ఎంపీడీవో కార్యాలయ రికార్డులుగా అనుమానం

పుంగనూరు, జూలై 5: చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శ్మశానం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ రికార్డులు దహనమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయానికి చెందిన రికార్డులను సంచిలో వేసుకొని రహస్యంగా కాల్చి బూడిదచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎంపీడీవో కార్యాలయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన రికార్డులు చెరిపేయాలనే ఈ చర్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పాలనలో ఏదైనా అక్రమాలు జరిగిఉంటే టీడీపీ ప్రభుత్వంలో వెలికి తీస్తారనే భయంతో ఉపాధిహామీ ఇతరశాఖల రికార్డులు కాల్చివేశారా అనే ప్రచారం జరుగుతోంది.

- చేరికలతో పాతికమందికి పెరిగిన కూటమి బలం
- ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్యేలు
- కౌన్సిల్‌లో స్పష్టమైన మెజారిటీ

టీడీపీ ఖాతాలోకి చిత్తూరు కార్పొరేషన్

చిత్తూరు సిటీ, జూలై 5: చిత్తూరు నగర పాలక సంస్థ కూటమి ఖాతాలో చేరింది. శుక్రవారం నాటి చేరికలతో కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వీరిలో మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేష్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, అసంతృప్తులతో పాటు అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న భావనతో పలువురు పార్టీ మారారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 50 డివిజన్లు ఉండగా.. అప్పట్లో 37 చోట్ల వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకుంది. మిగిలిన వాటికి ఎన్నికలు జరగ్గా.. 3 చోట్ల టీడీపీ గెలిచింది. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో వీరి బలం 21కి పెరిగింది. కొన్నాళ్ల కిందట నలుగురు జనసేనలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమికి 25 మంది సభ్యులయ్యారు. వీరికి తోడు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా చేరడంతో ఆ సంఖ్య 27కి చేరింది. ఇంకా కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, చేరికల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, నగర అభివృద్ధి కోసం మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, అశోక్, కంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే గురజాల

ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దుతాం

అందరి సహకారంతో చిత్తూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయరు అముద తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వేలూరు, తిరుపతికి దీటుగా చిత్తూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీనికోసం ఎమ్మెల్యే వద్ద మాస్టర్ ప్లాన్ ఉందన్నారు.

టీడీపీలో చేరిన కార్పొరేటర్లు వీరే

మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఎస్.రాజేష్ కుమార్ రెడ్డి, డివిజన్ల వారీగా కార్పొరేటర్లు.. పి.నవీన్ కుమార్(2వ) బి.అజర్ భాను (6వ), డి.కె.సుమతి (10వ), ఎం.శాంతి (18వ), పి.గంగ (22వ),ఇ.ఇందు (27వ), టి.ప్రభావతి (28వ), ఎస్.సుష్మ (30వ), సయ్యద్ సర్దార్ (31వ), ఎస్.ఉన్నికృష్ణ (38వ), పి.గణేష్, (40వ), కుప్పమ్మ (41వ), ఆర్.శశికుమార్ (42వ), పి.వెంకటరమణ (43వ), ఎస్.రెడ్డెప్ప (46వ), ఏజీ సహదేవన్ (50వ డివిజన్).

22 మంది కార్పొరేటర్ల సస్పెన్షన్

చిత్తూరు: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ 22 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కో- ఆప్షన్ సభ్యులను సస్పెండు చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు భరత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు కొంత మంది కార్పొరేటర్లు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా ఎన్నికల సమయంలో చర్యలు తీసుకోకూడదని పార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మేయరు, డిప్యూటీ మేయరు సహా 18 మంది కార్పొరేటర్లు శుక్రవారం టీడీపీలో చేరిపోయారు. గతంలో నలుగురు జనసేనలో చేరిన విషయం తెలిసిందే.

AP RERA
RERA No. P10370174734
DTCP APPROVED LAYOUT
LP NO. 68/2023/1176/DTCP/DPMS



NEWTOWN J
WORLD-CLASS INTEGRATED TOWNSHIP @ PUNGANUR

Project Highlights
61 ACRES of Sprawling Greens
747 Green Luxurious Plots
50% 50 % Open Area
2 Acre Manmade Lake Surrounded by 3 Acre Park
1 Mango Tree in each Plot

5 Star Resort Amenities
52K SFT World Class Clubhouse with 50+ amenities
Community Parks & Playgrounds
Wellness and Spa
Sports and Fitness Facilities
Swimming Pool
3.5 km Jogging & Cycling Track around the Perimeter

FIRST TIME IN INDIA 1000+ TREES 30 YEARS AGED MORE THAN TRANSLOCATED AT THE SITE
SPOT REGISTRATION
80% LOAN FACILITY

COME. CHOOSE. INVEST.
SECURE YOUR INVESTMENT WITH THE TRUSTED DEVELOPER

NEWTOWN J is one of South India's most high- end plotted development, spanning 60 acres of awe-inspiring magnificence, including 750 expansive plots.

NEWTOWN J is the only plotted development with all the statutory approvals in place, so you are at peace and your investment is safe and secure.

All NOCs Obtained From
IRRIGATION DEPARTMENT
NATIONAL HIGHWAYS AUTHORITY

Site Address: Ethur Circle, NH 42, Chennai-Hyderabad, Adjacent to Punganur- Madanpalli Bypass, Chittoor (D), AP

Strategic Partner
realtydoor
To Own your piece of paradise, Call:
91177 88669
info@realtydoor.com
www.jnewtown.in
Scan to Download Brochure
Scan for Site Location

రైస్‌మిల్లు మూసివేతపై దుష్ప్రచారం

● గ్రామస్తుల ఆరోగ్యానికి హానికరంగా తయారైందనే మూయించిన ఎమ్మెల్యే నాని ● కుంట్రపాకం గ్రామస్తుల వెల్లడి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 5: గ్రామంలో ప్రజల ఆరోగ్యానికి హానికరంగా తయారైన రైస్‌మిల్లు మూసివేత విషయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై దుష్ప్రచారాలు చేయడం దుర్మార్గమని కుంట్రపాకం గ్రామస్తులు చెంచుకృష్ణయ్య, జయప్రకాష్, రామ్మూర్తి, గోవర్ధన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వారు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలను తెలిపారు. 'తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకంలో శ్రీలక్ష్మీ వెంకట మంజునాథేశ్వర రైస్ ప్రోడక్ట్స్ పేరుతో ఓ పెద్ద రైస్‌మిల్లు 15 ఏళ్లుగా నడుస్తోంది. ఈ రైస్‌మిల్లు గ్రామస్తుల ఆరోగ్యానికి హానికరంగా తయారైంది. దీనివల్ల అనేకమంది అనేక రోగాల బారిన పడ్డారు. ఈ రైస్‌మిల్లును మూసివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని దశాబ్దకాలంగా రాజకీయ నాయకులకు, కాలుష్యనియంత్రణ మండలి అధికారులకు ఎన్నోసార్లు విజ్ఞాపనలు చేసినా మా గోడును ఎవరూ పట్టించుకోలేదు. 2014లో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కూడా మా సమస్యను చెప్పుకున్నాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రైస్‌మిల్లును మూయిస్తానని చెవిరెడ్డి హామీ ఇచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినా రైస్‌మిల్లు సమస్య పరిష్కరించలేదు. పైగా దాని నిర్వాహకులు బెదిరింపులకు దిగారు. ఇన్నాళ్లకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మా సమస్యను గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్న మిల్లును మూయించారు. అయితే కొందరు మిల్లును మూయించడాన్ని తప్పుబడుతూ వారి అనుకూల పత్రికల్లో అబద్ధపు వార్తలను రాయించారు. దీన్ని మేమంతా ఖండిస్తున్నాం' అని గ్రామస్తులు తెలిపారు. సమావేశంలో గ్రామస్తులు పురుషోత్తంరెడ్డి, చెంచురెడ్డి, గురుమూర్తి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కుంట్రపాకం గ్రామస్తులు

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, జూలై 5: కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో కుష్టు, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మృదులా దేవి, వైద్య సిబ్బంది గిరిజ, త్రివేణి, కమల, లక్ష్మి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చేపట్టండి

రామచంద్రాపురం, జూలై 5: రైతులు మామిడికాయల కోతల అనంతరం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారి సునీల్ కోరారు. రావిళ్లవారిపల్లెలో మామిడితోటలను శుక్రవారం సునీల్ పరిశీలించి.. రైతులకు పలుసూచనలు ఇచ్చారు. ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి వారాహి నవరాత్రులు

రామచంద్రాపురం, జూలై 5: రాయలచెరువుకట్టపై ఉన్న శ్రీశక్తిపీఠంలో శనివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు వారాహి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది రోజులపాటు వారాహి దేవి ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారన్నారు. రోజూ హోమంతోపాటు విశేష అభిషేకాలు ఉంటాయన్నారు. 15వ తేదీ పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌పై రేకులషెడ్డు తొలగింపు



తిరుపతి(రూరల్), జూలై 5: తిరుపతి రూరల్ మండలం అర్సీపురానికి వేళ్లే ప్రధాన రహదారిలో అవిలాల అంబేడ్కర్ కాలనీ ఎదురుగా స్థానిక వైపీసీ నేత ఫుట్‌పాత్‌ని ఆక్రమించి చేపట్టిన రేకులషెడ్డు నిర్మాణాన్ని శుక్రవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి తొలగించారు. ఈవిషయమై ఈనెల 3వ తేదీన 'ఫుత్‌పాత్‌పై దర్జాగా రేకులషెడ్డు నిర్మాణం' శీర్షికని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన గాంధీపురం పంచాయతీ సెక్రటరీ కరుణశ్రీ, వీఆర్వో భాను తమ సిబ్బందితో వెళ్లి అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నానీ ఆప్యాయత మరువలేనిది

రాజధాని అమరావతి రైతులు



రాజధాని రైతులతో ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), జూలై 5: న్యాయస్థానం టు దేవస్థానం కార్యక్రమంలో భాగంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన తమపై అప్పట్లో ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ చూపిన ఆప్యాయత మరువలేనిదని రాజధాని అమరావతి రైతులు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, అమరావతి రాజధాని పనులకు ప్రాణం పోసుకోవడంతో రాజధాని రైతులు శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని ఓ ఫంక్షన్ హాలులో నానీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ నానీపై జరిగిన దాడి తమను ఎంతగానో కలచివేసిందన్నారు. అనంతరం నాని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం తమ పొలాలను త్యాగం చేసిన అమరావతి రైతుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. చంద్రబాబు పాలనలో అమరావతిలో అభివృద్ధి పనులు పరుగులు పెడతాయని చెప్పారు.

వైసీపీ నాయకులపై దాడులు అరికట్టండి

ఎస్పీకి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూలై 5: జిల్లాలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలసి వినతి పత్రం సమర్పించారు. తిరుపతిలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

స్విమ్స్‌లో సీనియర్ రెసిడెంట్

డాక్టర్ల, ట్యూటర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), జూలై 5: శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్)లో ఈనెల 10న సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, ట్యూటర్స్(అడహాక్ బేసిస్ పద్ధతిన) పోస్టులకు ఈనెల 10 వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టులు, ఆరు ట్యూటర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 5: 'వచ్చేది వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలి' అని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పలు అంశాలపై మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్ల పురోభివృద్ధిలో అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్‌కి అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. డయేరియాపై జిల్లా వ్యాప్తంగా మెడికల్‌క్యాంపులు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్వో పెంచలకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ హెల్ప్‌లైన్ కేంద్రంలో విద్యార్థుల సందడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5: ఏపీ ఎంసెట్-2024 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ నేపథ్యంలో ఎస్వీయూనివర్సిటీ పాత ఎంబీఏ భవనంలో హెల్ప్ లైన్ కేంద్రం ఏర్పాటైంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురైన ఇబ్బందులను ఈ కేంద్రం ద్వారా విద్యార్థులు పరిష్కరించుకుంటున్నారు. వందలాది మంది విద్యార్థులు రావడంతో హెల్ప్ లైన్ కేంద్రం సందడిగా మారింది. విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు హెల్ప్‌లైన్ కేంద్రం ఇన్‌చార్జి వివేకానందరెడ్డి తెలిపారు.

శ్రీవారి పోటు కార్యకలాపాలపై ఈవో సమీక్ష

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలోని పోటులో లడ్డూ ప్రసాదాలు తయారు చేసే కార్మికుల విధులపై టీటీడీ ఈవో శ్యామలరావు అధ్యయనం చేశారు. గోకులం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి పోటు కార్యకలాపాలపై సమీక్షించారు. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు ఏఈవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి



చంద్రగిరి, జూలై 5: నారావారిపల్లెలోని టీడీపీ నాయకుడు నారా చిన్నబ్బనాయుడు మృతికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఘనంగా నివాళులు అర్పించారు. సీఎం చంద్రబాబు బంధువైన చిన్నబ్బనాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం నారావారిపల్లెకు చేరుకున్న ఎమ్మెల్యే.. చిన్నబ్బనాయుడు మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

చంద్రగిరి, జూలై 5: మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు శుక్రవారం విరాళాలు అందజేశారు. ఎం.కొత్తపల్లెకు చెందిన చలిచీమల కోదండ రామానాయుడు రూ2,00,116, కొమ్మినేని శేఖర్‌నాయుడు రూ.50,001, తిరుపతికి చెందిన కొండూరు భాస్కర్‌రాజు రూ.10,116.. ఆలయ అధికారులకు అందజేశారు. టీడీపీ నేత, మాజీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



తిరుపతి (వైద్యం), జూలై 5: తిలకరోడ్డులోని ఎస్‌బీటీ మెడికేర్ మందుల షాపు మొదటి వార్షికోత్సవం సందర్భంగా రుయాస్పత్రి సౌజన్యంతో రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత కేవీ చౌదరి మాట్లాడారు. అన్నిరకాల మందులను, వైద్య పరికరాలను తక్కువ ధరకే విక్రయిస్తుండటం వల్ల గడిచిన ఏడాదిలో తమ సంస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీటీ మెడికేర్ సిబ్బంది పాల్గొన్నారు.

బరితెగించిన పెద్దిరెడ్డి అనుచరుడు

● నడి రోడ్డుపైనే బార్





పంచాయతీరోడ్డును ఆక్రమించి మందుబాబుల కోసం ఏర్పాటు చేసిన సిట్టింగ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 5: తిరుచానూరు ముఖద్వారం సింధు జంక్షన్ పై ఓవర్ సమీపంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు ఒకరు బార్ నడుపుతున్నాడు. శ్రీనివాసపురం పంచాయతీకి చెందిన రహదారిని ఆక్రమించి.. రోడ్డుపైనే ఏకంగా మందుబాబుల కోసం సిట్టింగ్ ఏర్పాటు చేసి రెండువైపుల రాకపోకలు లేకుండా ఫ్లెక్సీలు అడ్డుపెట్టాడు. రోడ్డుపై ఇనుప రేకులషెడ్, బెంచీలు వేసి మద్యం తాగిస్తున్నాడు. లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ముతో వేసిన రోడ్డును ఆక్రమించడంపై ప్రశ్నించిన అధికారులపై బెదిరింపులకు దిగుతున్నాడని సమాచారం. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే పంచాయతీ రహదారిని ఆక్రమించినా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పైగా ఈబార్‌కు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టీటీడీ నిర్ణయించే ధరలకే భక్తులకు ఆహారపదార్థాలు

● రుచికి, శుచికి అధిక ప్రాధాన్యం ● తిరుమలలో టూరిజం హోటల్ ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్



హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరుమలలో ఏర్పాటు చేసిన 'దేవరాగం' అనే హోటల్‌ను టూరిజం మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఉదయం శ్రీవారి దర్శనానంతరం టీటీడీ ఈవో శ్యామలరావు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. హోటల్‌లో సౌకర్యాలను పరిశీలించి, టిఫిన్ తిని రుచిని చూశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ నిర్ణయించిన ధరలకే భక్తులకు ఆహార పదార్థాలు అందజేస్తామన్నారు. 2018లో టీటీడీ సహకారంతో తిరుమలలో టూరిజం నుంచి శ్రీనివాసం అనే హోటల్‌ను ప్రారంభం జరిగిందని, అలాగే అన్నమయ్య, బాలాజీ అనే హోటళ్లను కూడా ఏపీ టూరిజం నడుపుతోందన్నారు. తాజాగా దేవరాగం అనే హోటల్‌ను ప్రారంభించామన్నారు. విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికి, శుచికి ప్రాధాన్యమిస్తూ ఈ హోటళ్లను నడుపుతామన్నారు. అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దటానికి తిరుమల, తిరుపతిలు అనువైన ప్రాంతాలన్నారు. తిరుపతిలో టూరిజం శాఖకు ఉన్న 30 ఎకరాల స్థలాన్ని కూడా పర్యాటకులను ఆకర్షించేలా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇతర ప్రాంతాల్లో కొన్ని హోటళ్లను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన మాట వాస్తవమే కానీ తిరుమలలో హోటళ్ల మాత్రం టూరిజమే నడుపుతుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. టూరిజం దర్శనాలకు అధిక సమయం పడుతోందని భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ అంశాన్ని టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లి, భక్తులకు వీలైనంత త్వరగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే విందు



ఎమ్మెల్యే ఆరణి నివాసం వద్ద మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి దుర్గేశ్‌కు శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చారు. తిరుపతి పరిసరప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఈసందర్భంగా మంత్రిని కోరారు. జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, ఆరణి శివకుమార్, పొలకల మల్లికార్జున్, రాజా రెడ్డి, కీర్తన, సుభాషిణి, ఆనంద్, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, వెంకటేశ్వరరావు, బెల్లంకొంగ సురేష్, బండ్ల లక్ష్మీపతి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధిలో భాగస్వాములుకండి



టూరిజం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి దుర్గేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రముఖ ట్రావెల్ సంస్థ సైన్‌ఇన్ ట్రావెల్ కార్యాలయాన్ని సందర్శించారు. సైన్‌ఇన్ ట్రావెల్స్ ఫౌండర్ ఇనగల్ల ప్రదీప్, ఎండీ పెమ్మసాని వెంకట రమణ, జనసేన నేత కిరణ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును ఢిల్లీలో కలిసిన టీడీపీ నాయకుడు ఇందుశేఖర్

వేదాంతపురంలో స్థల వివాదం

తిరుపతి రూరల్, జూలై 5: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్లు 221/1, 221/2, 219/10స్థలంలో భూహక్కుదారులు(రైతులు), బిల్డర్ల నడుమ స్థల వివాదం నడుస్తోంది. ఇరువురు ఈస్థలం తమదంటే తమదేనంటూ వాదనలు చేస్తున్నారు. వివాదం నడుస్తున్న స్థలంలో గురువారం బిల్డర్ నిర్మాణ పనులు చేపట్టడంతో రైతులు జి.వాసుదేవరెడ్డి, ఎ.లోకనాథరెడ్డి అడ్డుకున్నారు. 219/10లో 98సెంట్లు, 216లో 16సెంట్లు, 221/1లో 79సెంట్ల భూమిని తాము ఎవరికీ విక్రయించలేదని, ఎవరికైనా అమ్మినట్లు రికార్డులు ఉంటే తీసుకురావాలని అంటున్నారు. దీనిపై బిల్డర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సర్వేనెంబర్లు 221/1, 221/2, 219/10లలో 2022 ఏప్రిల్‌లో కత్తి మమత, మాసి కృష్ణమూర్తిల వద్ద తాను 16 ప్లాట్లని డెవలప్‌మెంట్ కోసం తీసుకుని 60శాతం పనులను పూర్తి చేశానని అంటున్నారు. అయితే అదేసంవత్సరం నవంబరులో ఎ.లోకనాథరెడ్డి, జి.వాసుదేవరెడ్డి వచ్చి 219/10లో 54సెంట్లు తాము ఎవరికీ అమ్మలేదని లోయర్ కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసి దానిలోని ప్లాట్లని పరాధీనం చేయకూడదని మాత్రమే ఆర్డర్స్ తెచ్చారే తప్ప నిర్మాణ పనులు చేపట్టరాదని తీసుకురాలేదని అంటున్నారు. దాంతో 219/10లోని 54సెంట్లకి సంబంధించిన 3ప్లాట్లలో(నెంబర్లు 43,44,45) తాము నిర్మాణం చేయకుండా నిలుపుదల చేశామని అంటున్నారు. సర్వేనెంబరు 221/1లో తమస్థలం ఉందని చెప్పారని, దానికి ఎటువంటి ఆధారాలు వారివద్ద(రైతులు) లేవని బిల్డర్ అంటున్నారు. అటువంటిది దౌర్జన్యంగా పనులను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.

రాజంపేట యువతికి గుంటూరు లాయర్ గుండె

● శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో శస్త్ర చికిత్స



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకువెళుతున్నవైద్యులు

తిరుపతి(వైద్యం), జూలై 5 : రోడ్డు ప్రమాదంతో బ్రెయిన్ డెడ్‌కు గురైన 40 ఏళ్ల వ్యక్తి గుండెను 16 ఏళ్ల యువతికి అమర్చారు.తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు..గుంటూరుకు చెందిన న్యాయవాది మునగపాటి ప్రసాద్ (40) రోడ్డు ప్రమాదానికి గురై విజయవాడలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. ఈ విషయాన్ని ప్రసాద్ కుటుంబ సభ్యులకు చెప్పిన వైద్యులు అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు ప్రసాద్ అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు.ఈ విషయం తెలుసుకున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రత్యేక వైద్య బృందంతో కలిసి శుక్రవారం విజయవాడ చేరుకున్నారు. అక్కడ ప్రసాద్ నుంచి గుండెను సేకరించి దానిని ప్రత్యేక విమానంలో సాయంత్రం 4.45 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అక్కడినుంచి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్సులో 5.05గంటలకు తిరుపతి నగరంలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకొచ్చారు. ఈ గుండెను కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతున్న అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన స్పందన(16) అనే యువతికి అమర్చినట్లు తెలిపారు.

రాయలచెరువు సప్లయ్ చానల్ గాలికొదిలేసినట్లేనా?

● రెండేళ్లవుతున్నా పూడికతీత ఊసెత్తని వైనం ● భూములు కోల్పోయిన రైతులకూ అందని పరిహారం ● భారీ వర్షాలొస్తే పరిస్థితేంటని భయాందోళనలో స్థానికులు



సప్లయ్ చానల్

రామచంద్రాపురం, జూలై 5: రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు రాయలచెరువు కట్ట కింద ఉన్న గ్రామప్రజలను కాపాడేందుకు వడ్డికాలువ నుంచి బాదూరు వరకు సప్లయ్ చానల్ తవ్వారు. నెల తర్వాత పూడికతీత పనులు చేపట్టడానికి కాంట్రాక్టరు వచ్చారు. ఈ సమయంలో కాలువ కింద భూములు కోల్పోయిన రైతులు తమకు పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలనడంతో పూడికతీత ఆగిపోయింది. వివరాలిలా ఉన్నాయి. 2021 నవంబరు 21న భారీ వర్షాలు జలప్రళయం సృష్టించాయి. ఎటుచూసినా ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు ఊర్లను ముంచేశాయి. ఆర్సీపురం మండలమైతే ద్వీపకల్పమై నాలుగు భాగాలుగా విడిపోయింది. రాయలచెరువుకట్ట కుంగింది అనే ప్రచారంతో 30 గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మూటాముల్లి సర్దుకుని తలోదిక్కుకు వెళ్లిపోయారు. ఈ సమయంలో రాయలచెరువును పరిశీలించిన అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు కలిసి రైతులను ఒప్పించి.. చెరువు కట్ట పైభాగాన వడ్డికాలువ నుంచి బాదూరు వరకు సప్లయ్ చానల్ తవ్వారు. చెరువునీటి ఉధృతిని తగ్గించి ప్రాణనష్టంతోపాటు కట్ట తెగకుండా కాపాడగలిగారు. ఆ సమయంలో సప్లయ్ చానల్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తామని కలెక్టర్ చెప్పడంతో వారు ఒప్పుకున్నారు. సరిగ్గా నెల తర్వాత సప్లయ్ చానల్ పూడిక తీసి.. మరింత పటిష్ఠంగా కాలువను ఏర్పాటు చేయడానికి రూ.28లక్షలతో టెండర్ పిలిచారు. కాంట్రాక్టరు పనులు చేయడానికి పూనుకోగా రైతులు తమ భూములకు నష్టపరిహారం చెల్లిస్తే తప్ప కుదరనడంతో పనులు ఆగిపోయాయి. అప్పటినుంచి ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. భూములు కోల్పోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం చెల్లించిందిలేదు. అనుకోని విధంగా మళ్లీ భారీ వర్షాలు కురిసి రాయలచెరువు నిండితే కట్టకింద ప్రజలు తమ పరిస్థితి ఏమిటని భయాందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి భారీ వర్షాలు కురవక ముందే శాశ్వత ప్రాతిపదికన సప్లయ్ చానల్‌ను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా నష్టపరిహారం ఇవ్వలేదు



రాయచెరువు సప్లయ్ చానల్ కోసం ముగ్గురు రైతుల నుంచి పొలాలు తీసుకుని పనులు చేపట్టారు. ఆ సమయంలో నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు హామీలు ఇచ్చారు. మాకు సంబంధించిన ఎకరం పొలం కూడా తీసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు.

- వజ్రవేలు పిళ్లై, కుప్పం బాదూరు



చంద్రగిరిలో దుకాణాల కూల్చివేత

చంద్రగిరి, జూలై 5: చంద్రగిరి పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఎదురుగా వైసీపీ హయాంలో జమండ్లవీధి వాసులు ప్రభుత్వ స్థలంలో దేవాలయం నిర్వహణ పేరిట దుకాణాలు నిర్మించారు. టీడీపీ అధికారంలోకి రావడంతో మూడు రూమ్‌లకు సంబంధించిన విద్యుత్ మీటర్లు తొలగించారు. గత నెల 30వ తేదీన టీడీపీ, బీజేపీ నాయకులు మూడు గదులను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయడానికి ప్రయత్నించారు. అయితే ఆ వీధిలోని మహిళలు, వైసీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. శుక్రవారం సాయంత్రం మాత్రం మూడు గదులను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. దీనిపై జమండ్లవీధి, ఆకుతోట వీధివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'నేను ప్రభుత్వ బడికే వస్తా' ర్యాలీ

ఎర్రావారిపాలెం, జూలై 5: నేను ప్రభుత్వ బడికే వస్తా.. కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. నెరబైలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ముక్కు చంద్రశేఖర్, లాల్ షా, నాగరాజ, జయప్రకాష్, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం

● స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటుకు అడుగులు

● ఎస్పీ నేతృత్వంలో పటిష్ఠమైన వ్యవస్థ

తిరుపతి(నేరవిభాగం), జూలై 5: గంజాయి, డ్రగ్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపనున్నారు. హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడెక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి? ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? మూలాలెక్కడ? సూత్రధారులెవరు? అనే విషయాలపై జిల్లా పోలీసు యంత్రాంగం దృష్టి పెట్టింది. దీనికోసం రెండు ప్రత్యేక బృందాలు జిల్లాలో పర్యటిస్తున్నాయి. ఐదేళ్లలో తిరుపతిని గంజాయి కేంద్రంగా అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన అనుచరులు మార్చేశారని ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నారు. పది రోజుల వ్యవధిలోనే దాదాపు 25 కేసులు నమోదు చేసి నిందితులను జైలుకు తరలించారు. గురువారం కూడా 16 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు మంత్రి వర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో అనుభవజ్ఞులైన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటుకు ఎస్పీ కసరత్తు చేస్తున్నారు.

పటిష్ఠంగా డి-అడిక్షన్ కేంద్రాలు

తిరుపతిలోని రుయా, పాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డి-అడిక్షన్ కేంద్రాలను మరింత పటిష్ఠం చేయడంపైనా దృష్టి పెట్టారు. ఈ కేంద్రాలను రెండు, మూడ్రోజుల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ కలిసి సందర్శించనున్నారు.





ఆరణి గారూ.. ప్రాధాన్యతాంశాలపై దృష్టిపెట్టండి

నేడు మున్సిపల్ యంత్రాంగంతో ఎమ్మెల్యే తొలి సమీక్ష

తిరుపతి- ఆంధ్రజ్యోతి

ఎన్నికల ఫలితాల అనంతరం సరిగ్గా నెల రోజుల తర్వాత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాలనపై పట్టుసాధించే పనిలో పడ్డారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలపై ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. అదేవిధంగా స్మార్ట్ సిటీకి సంబంధించి పెండింగ్ ప్రాజెక్టులు గురించి తెలుసుకోనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, టీడీఆర్ బాండ్లు, ఎపిక్ కార్డుల కుంభకోణాలు, నీటి సమస్యలపైనా చర్చించాల్సిన అవసరం కనిపిస్తోంది. నగరంలో ప్రాధాన్యత అంశాలపైన దృష్టిపెట్టే దిశగా యంత్రాంగానికి ఎమ్మెల్యే దిశానిర్దేశం చేయాల్సి ఉంది.

యూడీఎస్‌పై దృష్టిపెట్టండి

వర్షాకాలం రాబోతుంది. యూడీఎస్ అస్తవ్యస్థంగా ఉంది. ఐదేళ్లలో తిరుపతిలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ (యూడీఎస్)ను ముట్టుకున్న పాపానపోలేదు. యూడీఎస్‌లో ముంబై మున్సిపాలిటీ అమలుపరిచే సాంకేతిక విధానాలు ఇక్కడ కూడా తీసుకువస్తామని నాటి నేతలు గొప్పలు చెప్పారు. పైలెట్ ప్రాజెక్టుగా తొలుత 10 కి.మీ డ్రైనేజీ విధానాన్ని మార్చి, తర్వాత నగరమంతా విస్తరిస్తామన్నారు. ఇంతలో ఏమైందో ఏమోకానీ దానిని అటకెక్కించేశారు. మ్యాన్‌హోల్స్ పొంగడం వలన కలిగే అసౌకర్యం అటుంచితే, భూగర్భంలో డ్రైనేజీ పైపుల లీకేజీ వలన, అవి మంచినీటి పైపుల్లో కలిసి పోయి కలుషిత నీరు సరఫరా అవుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అసలే వర్షాల సీజన్ మొదలుకావడంతో ప్రజారోగ్యం పెను ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. దోమల బెడద తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఇళ్లలోకి నీళ్లు రావడం, కాలువలు పొంగడాన్ని ఆపాలంటే యుద్ధ ప్రాతిపదికన యూడీఎస్‌పై దృష్టిసారించాలి. ఆదిశగా యంత్రాంగాన్ని ఎమ్మెల్యే అప్రమత్తం చేయాల్సి ఉంది.

మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యత

వైసీపీ నేతలు సులభమైన ఆదాయ వనరుగా మాస్టర్ రోడ్లను తెరపైకి తెచ్చారన్న విమర్శలున్నాయి. అందుకుతగ్గటే ఆరు నెలలు కాకముందే మాస్టర్ ప్లాన్‌రోడ్లలో డొల్లతనం బయటపడిపోయింది. శ్రీకులశేఖర్ ఆళ్వార్ మార్గాన్ని ఎమ్మెల్యే పరిశీలించి.. మాస్టర్ రోడ్ల నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు కూడా. ఆదిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏడాది కాలంలోనే 42 మాస్టర్ ప్లాన్ రోడ్లను తెరపైకి తెచ్చి, హడావుడిగా 18 రోడ్లను పూర్తి చేశారు. వెళ్లిన మార్గంలోనే తిరిగి వచ్చేలా అర్థంతరంగా ముగించారు. వైసీపీ నేతల స్థలాలున్న చోట్ల రోడ్లు వేసుకుని అభివృద్ధి చేసేశామని బాకా ఊదుకుంటున్నారు. అయితే ఆ రోడ్లన్నీ పరిశీలించి నాణ్యతతోపాటు వీటివెనుక రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన టీడీఆర్ బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయల అవినీతిపైనా చర్చించాల్సిన అవసరం ఉంది.

ఎపిక్ కార్డుల కుంభకోణం విచారణ వేగవంతమయ్యేనా?

ఫేక్ ఎపిక్ కార్డుల తయారీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కుంభకోణమిది. ఎన్నికల వెబ్‌సైట్‌లోకి చొరబడి 34వేల ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ వెనుక అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ప్రమేయం ఉందన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. అతనిపైనే వేళ్లన్నీ చూపిస్తున్నాయి. ఈ ఉదంతంపైనే ఐఏఎస్ అధికారి.. అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరీష, ఇతర అధికారులపై వేటు పడింది. తిరుపతి ప్రతిష్ట దిగజారింది. విచారణ నత్తనడకన సాగుతోంది. దీనిపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని తగు చర్యలు తీసుకోవాల్సివుంది.

టీడీపీ హయాంలో పురుడుపోసుకున్న ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేనా?

సిటీ ఆపరేషన్ సెంటర్ (సీవోసీ) బిల్డింగ్ అండ్ పాన్ సిటీ ఐసీటీ సొల్యూషన్స్ పేరిట రూ.225 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేశారు. భవన నిర్మాణం రూ.79కోట్లు, సీవోసీ సెటప్‌కోసం దాదాపు రూ.146కోట్ల అప్పుడు బడ్జెట్ ప్రతిపాదన చేశారు. అదేవిధంగా నగరంలో పార్కింగ్ సమస్య తీర్చడానికి గత టీడీపీ హయాంలో రూ.15కోట్ల బడ్జెట్‌తో 120 కార్లు, 120 స్కూటర్లు పార్కింగ్ చేసుకునేలా మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. బడ్జెట్‌ను రూ.15కోట్ల నుంచి రూ.50కోట్లకు పెంచుతూ కార్ల పార్కింగ్ సంఖ్యను కూడా పెంచారు. టీడీపీ హయాంలో పురుడు పోసుకున్న ఈ ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా ఎమ్మెల్యే దృష్టి సారించాల్సి వుంది.

టీడీఆర్ బాండ్ల నిలిపివేతపై కలకలం

ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల చెల్లుబాటు నిలిపివేస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నగరంలో కలకలం రేపింది. లావాదేవీలు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవని అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేసింది. టీడీఆర్ బాండ్లను వినియోగించుకోని వారి గుండెల్లో గుబులు పట్టుకుంది. మున్సిపల్ కౌన్సిల్ ప్రదిపాదించిన 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఇంకా 1200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. మొత్తం రూ.1,013 కోట్ల టీడీఆర్ బాండ్లు జారీచేసినట్టు ఉత్తర్వులో పేర్కొంది. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికే 75 శాతం టీడీఆర్ బాండ్లు వినియోగం జరిగిపోయిందని, తక్కిన 25 శాతం మాత్రమే ఉన్నట్టుగా తెలుస్తోంది. వీటిపై ఎమ్మెల్యే సమగ్రంగా దర్యాప్తు చేయించి నిజానిజాలు నిగ్గుతేల్చాల్సి.

శెట్టిపల్లె సమస్య తీరేనా?

దశాబ్దాల తరబడి స్వార్థ రాజకీయాలకు బలైపోతున్న శెట్టిపల్లె సమస్యకు ఎమ్మెల్యే ముగింపు పలకాల్సి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూడా శెట్టిపల్లె వ్యవహారంపై అవగాహనవుంది. వారికి న్యాయం చేసేదిశగా హామీలు కూడా ఇచ్చివున్నారు. కార్పొరేషన్‌లో శెట్టిపల్లెని విలీనం చేసుకున్నంత వేగంగా, వారి సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న ఆప్రాంతవాసుల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం వుంది.

భూగర్భ విద్యుత్ ఏమైందో?

తిరుపతి నగరంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ వారి సౌజన్యంతో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబ్లింగ్ పనులు చాలావరకు జరిగాయి. 130 కిలోమీటర్ల మేరకు 27 ప్రధాన రహదారుల్లో గల 33 కేవీ/11 కేవీ భూఉపరితలంలో విద్యుత్తు తీగలను భూగర్భ ఎలక్ట్రికల్ కేబ్లింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నం అర్ధంతరంగా ఆగిపోయింది. దాదాపు రూ.236 కోట్ల బడ్జెట్‌తో కొనసాగిన పనులు నిలిపివేయడానికి ఏవేవో సాకులు చెబుతున్నారు. ఫలితంగా అందుకు వినియోగించిన మెటీరియల్ పాడైపోతోంది. అదేవిధంగా రేణిగుంట దగ్గర సోలార్ ప్లాంట్ కూడా అందుబాటులోకి రాకుండా ప్యానెల్స్ దెబ్బతింటున్నాయి. వీటిపైనా ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి.



తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



చంద్రశేఖరన్ - గౌతమ్ సింఘానియా - అనిల్ రావిపూడి, సాహు గారపాటి

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టాటా గ్రూప్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్, రేమాండ్స్ గ్రూప్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా,సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి,ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, మాలకొండయ్య, బిగ్‌బాస్ కంటెస్టెంట్ అషురెడ్డి, సినీనటుడు భూపాల్‌రాజు వీరిలో ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.టీటీడీ ఈవో శ్యామలరావును గౌతమ్ సింఘానియా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నవీ ముంబైలో బాలాజీ మందిర నిర్మాణం, తిరుమల ఎస్వీ ఉన్నత పాఠశాలలో సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు సహకారంతో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి మాట్లాడుకున్నారు.

9, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను ఈనెల 9, 16 తేదీల్లో రద్దు చేయనున్నట్టు టీటీడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీవారి ఆలయంలో ఈనెల 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ సందర్భంగా 9వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో జూలై 9, 16 తేదీల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో 8, 15 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు తీసుకోబోమని టీటీడీ స్పష్టం చేసింది.

భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

తిరుపతి(నేరవిభాగం), జూలై 5: వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు తిరుపతి మహిళా రక్షక్ ఏఎస్ఐ గిరిజ సూచించారు. శుక్రవారం శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటినుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవరచుకోవాలని చెప్పారు.

న్యాయమూర్తికి సన్మానం



తిరుపతి(లీగల్), జూలై 5: వినియోగదారుల ఫోరం తిరుపతి కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన స్నేహలతారెడ్డిని శుక్రవారం న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలసి, సన్మానించారు. న్యాయవాద పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి గాలి మధుసూదన్‌రావు, కె.నారాయణ, సోమశేఖర్, రాజేష్, పి.గజేంద్ర, పృథ్వీ, ప్రియాంక తదితరులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 17మందికి జరిమానా

తిరుపతి(లీగల్), జూలై 5: మద్యం తాగి వాహనాలు నడిపిన 17మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ నాల్గవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వీరిలో అధిక మోతాదులో మద్యం తాగిన పోస్టల్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ టి.కృష్ణన్‌కు 4రోజులు, కోలావీధికి చెందిన శ్రీనివాసులుకు 3రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), జూలై 5: నగరంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ కె.వాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీ కాలనీ, ప్రకాశంరోడ్డు, ఎల్‌బీసీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తున్న కారణంగా ఈ అంతరాయం ఉంటుందన్నారు. దీనివల్ల ఇందిరానగర్, కుమ్మరతోపు, ప్రకాశంరోడ్డు, బాలాజీకాలనీ,వేశాలమ్మవీధి, పీపీ చావడి, నెహ్రూనగర్, బొమ్మగుంట, పోలీస్ క్వార్టర్స్, ఎల్‌బీసీ రోడ్డు, కోర్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరుపతి దంపతులకు ప్రతిష్టాత్మక అవార్డులు

ఏసియా యూకే బిజినెస్ మీట్‌లో ప్రదానం



తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్, సామాజిక సేవా రంగాల్లో తిరుపతికి చెందిన దంపతులకు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. లండన్‌లో గురువారం డబ్ల్యుబీఆర్ కార్పొరేషన్, హౌస్ ఆఫ్ కామన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఏషియా - యూకే బిజినెస్ మీట్ -2024 కార్యక్రమంలో యూబీఆర్ఎస్ హౌసింగ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ఛైర్మన్, ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ డైరెక్టర్ డాక్టర్ బత్తల ఉదయ్ తేజ హౌస్ ఆఫ్ కామన్స్ అవార్డు అందుకున్నారు. ఆయన సతీమణి పేరం గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రీష్మ ఎమర్జింగ్ విమెన్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును అందుకున్నారు. యూబీఆర్ఎస్ హౌసింగ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ తిరుపతి, విశాఖ, హైదరాబాదు నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ అధినేతలైన భార్యాభర్తలిద్దరూ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపిక కావడం విశేషం.



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న సుగుణమ్మ, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యాధికారులు

కలెక్టర్‌కు అభినందనలు

తిరుపతి(కలెక్టరేట్/ అర్బన్ /వైద్యం), జూలై 5: నూతన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో పలువురు కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. వీరిలో.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు బుల్లెట్ రమణ, చిన్నబాబు, మునిశేఖర్ రాయల్, హేమంత్‌రాయల్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు.. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు గోపీనాథ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అన్వర్‌బాషా, రూప్‌చంద్.. డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథి రెడ్డి తదితరులున్నారు.

అన్నం గట్టిపడకుండా..

ట్రాలీలపై గడా గుడ్డలు కప్పుతున్న టీటీడీ అధికారులు



గడా గుడ్డలు కప్పిన అన్నం ట్రాలీలు - మృదువుగా కనిపిస్తున్న అన్నం

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు వడ్డించే అన్నం గాలికి ఆరిపోయి.. గట్టిపడిపోకుండా ఉండేందుకు గడా గుడ్డలు (మందపాటి వస్త్రం) కప్పే విధానాన్ని టీటీడీ తెరపైకి తీసుకొచ్చింది. సాధారణంగా భారీస్థాయిలో అన్నం వండినప్పుడు ఏదైనా బహిరంగ ప్రదేశంలో ఉంచుతారు. అలాంటప్పుడు అన్నం గాలికి ఆరిపోయి గట్టిపడిపోకుండా పంచెలు, లేదా ఏదైనా వస్త్రాలను నీటితో తడిపి కప్పుతుంటారు. నిజానికి ఇది పాత అలవాటే. ఇటీవల తిరుమలలో భక్తులకు వడ్డించే అన్నం గట్టిగా ఉంటోందనే విమర్శలు భక్తుల నుంచి వస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఇటీవల టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఈవో శ్యామలరావు అన్నప్రసాదాలపై ప్రత్యేక దృష్టిసారించారు. నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు భక్తులకు అందించేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. సాధారణంగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రోజుకు 10 టన్నుల అన్నం వండుతారు. రద్దీరోజుల్లో 12 టన్నుల వరకు వండి భక్తులకు వడ్డిస్తుంటారు. ఈ క్రమంలో వండిన అన్నాన్ని ట్రాలీల్లో ఉంచుతారు. భక్తులు భోజనం చేసే హాళ్లలోకి ఈట్రాలీలు చేరేలోపు పైభాగంలోని అన్నం గాలికి ఆరి.. గట్టిగా మారిపోతోంది. దాంతో తడి చేసిన గడా గుడ్డలను ట్రాలీలపై కప్పితే అన్నం గట్టిగా మారకుండా ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు. దాంతో ప్రస్తుతం అన్నప్రసాద భవనంలో ఈవిధానాన్ని పరిశీలిస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సేవలను వెంటనే అందుబాటులోకి తెండి: ఈయూ

తిరుపతి (ఆటోనగర్), జూలై 5: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ, 5జీ సేవలను వెంటనే అందు బాటులోకి తేవాలని ఆ సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) జిల్లా కార్యదర్శి ఆర్వీ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. దేశంలోని ప్రైవేట్ సెల్‌ఫోన్ కంపెనీలు 12 నుంచి 25 శాతం వరకు టారీఫ్‌లు పెంచి వినియోగదారులపై భారం మోపాయన్నారు. మరోవైపు ప్రైవేటు కంపెనీల ప్రయోజనాల కోసమే బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరణ చేయడం లేదన్న విమర్శలూ ఉన్నాయని పేర్కొన్నారు. ఇకనైనా ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి.. వెంటనే బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సేవలను అందుబాటులోకి తేవాలని కోరారు.

టీటీడీ కాలేజీల్లో సీట్లు పెంచాలి

తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5: టీటీడీ కాలేజీల్లో విద్యార్థుల డిమాండుకు అనుగుణంగా సీట్లు పెంచాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ కోరారు. రాయలసీమ ప్రాంతంలోని పేద విద్యార్థుల కోసం ఈ కాలేజీల్లో సీట్లు పెంచే అవకాశం ఉన్నా, గత ప్రభుత్వం పెంచలేదన్నారు. టీటీడీకి సంబంధం లేని వ్యక్తిని విద్యాశాఖాధికారిగా నియమించారని తెలిపారు. వెంటనే టీటీడీ విద్యా విభాగాన్ని ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాదానం పథకాన్ని కొనసాగించాలని ఒక ప్రకటనలో విన్నవించారు.

మద్యం పాలసీని ప్రకటించాలి: ఏఐటీయూసీ

తిరుపతి(ఆటోనగర్), జూలై 5: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెంటనే మద్యం విక్రయాలపై తమ పాలసీని ప్రకటించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్డీ రవి డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీతో ప్రజలు, విద్యార్థులు, భక్తులు, ఆస్పత్రుల వద్ద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువైందని పేర్కొన్నారు.

పిన్నెల్లిని వెనకేసుకురావడం జగన్‌కు తగదు

టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీరమణ



తిరుపతి అర్బన్, జూలై 5: 'చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో కేవలం దిష్టిబొమ్మను దహనం చేసిన తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. టీడీపీలో చేరానని నాలాంటి వృద్ధులను రోజంతా జైల్లో పెట్టారు. అదే ఈవీఎంలను ధ్వంసం చేయడం అతి పెద్ద నేరం. తెలిసి కూడా అటువంటి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై చిన్న సెక్షన్ అయిన 307తోపాటు హత్యాయత్నం కేసు పెట్టారు. దానికే పిన్నెల్లిపై తప్పుడు కేసులు పెట్టారంటూ ఆయన్ను వెనకేసుకురావడం తగదు' అని మాజీ సీఎం జగన్‌కు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ నేత ఓవీరమణ సూచించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం నెల్లూరు సెంట్రల్ జైల్లో పిన్నెల్లిని పరామర్శించాక మాజీ సీఎం ఐపీసీ సెక్షన్లపై మీడియాతో ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో తమలాంటి వారిపై పెట్టిన కేసుల మాటేమిటని ప్రశ్నించారు. ఇక గతంలో టీడీపీ వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టిన పోలీసు అధికారులను కొనసాగించడంపై ప్రస్తుత పాలకులు ఆలోచన చేయాలని కోరారు. వైసీపీ హయాంలో కాపు సామాజిక వర్గానికి న్యాయం జరగపోవడంతోనే కలసికట్టుగా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడం జరిగిందని గుర్తుచేశారు. అన్ని పార్టీలలో పదవులు అనుభవించిన సి.రామచంద్రయ్యకు ఎమ్మెల్సీ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. గత టీడీపీ పాలనలో ఎంవోయూలు చేసుకున్న 140మంది పారిశ్రామికవేత్తల సంక్షేమాన్ని ఆలోచించాలని, సీఎం చంద్రబాబు వారితో తక్షణమే సమావేశం నిర్వహించాలని కోరారు. టీటీడీలో తప్పుచేసిన వారెవరైనా శిక్షార్హులేనని స్పష్టం చేశారు. ఇక వైసీపీ చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం కూడా చేయకుండా ఉండాలని హితవు పలికారు.

మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోండి

నగరంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



కమిషనర్‌తో కలిసి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 5: నగరంలో ఎక్కడా మురుగు నిల్వ లేకుండా, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డ్రైడే సందర్భంగా శుక్రవారం ఆయన నగరంలోని పలు కాలనీల్లో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్కావెంజర్స్ కాలనీలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కాలువల్లో చెత్త తీయడంలేదని స్థానికులు ఆయన దృష్టికి తేగా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కపిలతీర్థం కాలువలో పూడికతీత పనులను వచ్చే నెల నుంచి చేపడతామని అధికారులు తెలిపారు. సీజనల్‌వ్యాధులకు గురైన చిన్నారులను పరామర్శించి, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అలాగే దామినేడు హౌసింగ్‌కాలనీలోనూ కలెక్టర్ పర్యటించి, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF SURNAME
I, Ramineni Palakshi (Old Name) W/o Daruvuru Sankar Naidu R/o 20-49-S4-626-1, Subash Nagar, Tirupati Town, Tirupati Dist., A.P., have changed my Surname to DARUVURU PALAKSHI (New Name).
AJT - 4086

CHANGE OF NAME
I, R.V.Chenchaiah S/o R.Venkama Naidu (Old Name) R/o 1-47, Mannavaram, Srikalahasthi Mandal, Tirupati Dist., A.P., 517620 have changed my Name to RANGINENI VENKAMANAIDU CHENCHAIAH (New Name).
AJT - 4087

ప్లాట్స్ ఫర్ సేల్
5 లక్షల 9999 లకే హైవేకి అనుకొని తిరుపతి IISEER ప్రక్కన ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు. అయోధ్య టౌన్ షిప్ నందు కలవు. డైరెక్ట్ ఓనర్. 9502774175 / 7995992114.
AJT - 4085

CHANGE OF NAME
I, Varshini Rangineni W/o Chenchaiah Rangineni (Old Name) R/o 1-47, Mannavaram, Srikalahasthi Mandal, Tirupati Dist., A.P., 517620 have changed my Name to VARSHINI KALUVAKOLLU W/o RANGINENI VENKAMANAIDU CHENCHAIAH (New Name).
AJT - 4088

TAX CONSULTANTS
File Income Tax Returns, GST, Company Registration, ROC Fillings, Website Design, Business Registration, Vehicle Insurance, Digital Marketing at Low Prices, Call or Whatsapp 7207446677
AJT - 187457

PEST CONTROL
మీ పరిసరాలను దోమలు, బొద్దింకలు, ఎలుకలు, బల్లులు మరియు నల్లులు నుంచి సంరక్షించుకోండి. చెదలు నివారణ మా ప్రత్యేకత. తిరుపతిలో 25 సం॥ పైగా ఉత్తమ సర్వీసును అందిస్తున్న మరియు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఏకైక సంస్థ. గ్యారంటీతో సర్వీసు చేయబడును. సెల్ : 9848315414
AJT - 179600

TOLET
తిరుపతి, అక్కారంపల్లి రోడ్డు, ఉపాధ్యాయ నగర్‌లో 2 BHK, 3 BHK మరియు డూప్లెక్స్ హౌస్ (ఆఫీసులకు) అద్దెకు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్ర. : 9177186787.
AJT - 4061

HOUSE FOR SALE
తిరుపతి కొర్లగుంటలోని హచ్ టవర్ పక్కన 16" అంకణ (G+F+S) ఫ్లోర్లతో పడమర ముఖం గల ఇల్లు అమ్మకానికి కలదు. సం.ప్ర. సెల్: 98494 45835
AJT-10618

వంట మనిషి కావలెను
తిరుపతి పి.కె.లే అవుట్ అశోక అపార్ట్‌మెంట్‌లో వంట మనిషి (మహిళ) వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకు : 98667 26232
AJT - 187423

WANTED
తిరుపతిలో 20,000/- జీతంతో ప్రముఖ కొరియర్ కంపెనీలో ఉద్యోగావకాశము కలదు. బైక్ మరియు మొబైల్ కలిగి వుండాలి. వివరాలకు : 99855 04732, : 91775 41210.
AJT - 4084

WANTED
Wanted to HR Manager:5Y Exp, Senior Accountant:5Y Exp, Pharmasist:1Y Exp, Computer Operators:1Y Exp, work in Tirupati, Cont: megamedicals. ceo@ gmail.com
AJT-4074

ONE/TWO/SITTING
ఒకే సం//లో INTER, DEGREE, B.COM, BCA, BBA, BBM, B.SC, DIPLOMA, B.Tech, EEE, ECS, CIVIL, MAC (ALL BRANCHES), B.Ed, NURSING AARYA ONLINE COLLEGE, TPT. 93936 22612
AJT-4080

WANTED
Wanted Female Tele Callers, Salary Rs.20,000/- pm + Incentives upto Rs.25,000/-, Qua-Inter/Degree, RKC Group: 90006 37999, 88015 02343.
AJT-4076

ప్లాట్లు కొనబడును
నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, వైపాడు రోడ్ ఏరియాలోని ప్లాట్లు కొనబడును. సం.ప్ర. సెల్: 93464 48054, 79812 46665
AJR-193520

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(బిల్డెడ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189272

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఏడు కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయి సహా నిందితులతో సెబ్ సిబ్బంది

నాయుడుపేట టౌన్, జూలై 5: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. సెబ్ కార్యాలయంలో శుక్రవారం పట్టుబడ్డ గంజాయి సహా నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. పట్టణ పరిధిలోని జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. గుడివాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా 7.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గంజాయిని తమిళనాడుకు చెందిన ఇళవరసన్, కవిన్, ఆకాష్ తరలిస్తున్నట్టు తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా ముగ్గురికి 19వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

బేల్దారి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తడ, జూలై 5: బేల్దారి మృతి చెందడంపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కోటిచెరువు గ్రామానికి చెందిన కాయల మధుబాబు (40) కుటుంబసభ్యులతో విబేధించి రెండేళ్ల క్రితం అక్కంపేటకు వచ్చి బేల్దారి పనులు చేసుకుంటూ ఇక్కడే ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉండటంతోపాటు విపరీతంగా అరుస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అరిచి కిందపడిపోయాడు. చుట్టుపక్కలవారు మద్యంతాగి అరుస్తూ కిందపడిపోయి ఉంటాడని భావించి అలాగే వదిలేశారు. కొంత సమయం తరువాత కూడా అలాగే పడిఉండటంతో చుట్టుపక్కల వారు అతనిని పరిశీలించి 108 అంబులెన్స్‌ను పిలిపించి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు శుక్రవారం మృతదేహాన్ని పరిశీలించి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, జూలై 5: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జూన్ 25వ తేదీ నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో 108 వాహనం ద్వారా ఓ వ్యక్తి ఆ మహిళను చేర్పించాడు. మహిళను ప్రాథమిక చికిత్సల అనంతరం గూడూరుకు తరలించారు. అదే రోజు సాయంత్రం అక్కడి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 26వ తేదీ మృతి చెందడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆ మహిళ దగ్గర ఉన్న ఆధారాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన పఠాన్‌బీగా గుర్తించారు.

మున్సిపల్ రోడ్డు ఆక్రమణపై నోటీసులు



నాయుడుపేట, జూలై 5: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ రోడ్డును ఆక్రమించి రేకుల షెడ్లను తొలగించాల్సిందిగా మున్సిపల్ అధికారులు నోటీసులు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు ఆక్రమణలను తొలగించాలని లేకపోతే మున్సిపల్ సిబ్బంది స్వయంగా చర్యలు తీసుకుంటారన్నారు. దానికైన ఖర్చులు భరించాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

చెంగాళమ్మ సేవలో చీరాల ఎమ్మెల్యే



కొండయ్యకు ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జూలై 5: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరిని శుక్రవారం చీరాల ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల గ్రూపు సంస్థల చైర్మన్ బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



వాషింగ్ మెషిన్‌ను అందిస్తున్న లయన్‌క్లబ్ సభ్యులు

గూడూరు, జూలై 5: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలసదనంలో విద్యార్థులు దుస్తులు శుభ్రపరుచుకునేందుకు వాషింగ్ మెషిన్‌ను అందించారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, పేదలకు వైద్యసేవలు అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిల్లకూరు మండలం ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫయ్యర్ అందజేశామన్నారు. రవిచంద్ర, రవికుమార్, శివయ్య, వీరేంద్రనాథ్, మురళీరెడ్డి, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

9న తోటల ఫలసాయం వేలం

వెంకటగిరి, జూలై 5: స్థానిక పెరియవరం సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9వ తేదీన తోటల ఫలసాయం వేలం నిర్వహించనున్నట్లు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గోవిందరాజులు శుక్రవారం పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిమ్మ, చీనీ, సపోటా తోటల ఫలసాయంపై వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల లోపు పండ్ల తోటలను పరిశీలించవచ్చన్నారు. వివరాలకు నెం.8985461284లో సంప్రదించవచ్చు.

మళ్లీ నవ్వులతో ముంచెత్తడానికి రాబోతున్నాం

సినీ దర్శకుడు అనిల్ రావిపూడి



తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'ఎఫ్2', 'సరిలేరు నీకెవ్వరు' చిత్రాల తర్వాత మూడోసారి సంక్రాంతి సినీ అభిమానులను నవ్వులతో ముంచెత్తడానికి హీరో వెంకటేష్‌తో కలిసి ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం నిర్మాత సాహు గారపాటితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తనకు వెంకటేష్‌తో ఇది మూడో చిత్రమన్నారు.

ఈసారైనా డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యేనా?

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా గోషా ఆసుపత్రి



వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 5: శతాబ్దం చరిత్ర కలిగిన పట్టణంలోని గోషా ఆసుపత్రి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మద్యం బాబులు రాత్రి పూట ఇక్కడ వీరంగం సృష్టిస్తుండడంతో చుట్టు పక్కల నివాసాలు ఉంటున్న వారు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా మద్యం సీసాలను పగల గొట్టి నానా బీభత్సం చేస్తున్నారు. ఆసుపత్రి చుట్టు పక్కల పలు కాలేజీలు, పాఠశాలలున్నాయి. చిన్నారులు ఆడుకుందుకే వచ్చి సీసా పెంకులు గుచ్చుకుని ఆసుపత్రి పాలు అవుతున్నారు. టీడీపీ ప్రభుత్వం కొలువు దీరిన క్రమంలో గతంలో ఇక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారన్న హామీపై ఆశలు చిగురిస్తున్నాయి.

1920లో ప్రారంభమైన ఆస్పత్రి 2006వ సంవత్సరం వరకు సేవలందించింది. 2006లో అప్పటి ప్రభుత్వ హయాంలో బంగారుపేట పీహెచ్‌సీ పేరిట గోషా ఆస్పత్రిలోనే రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి అత్యవసర మాతా ప్రసూతి శిశు సంరక్షణ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. 2011లో వెంకటగిరి సీహెచ్‌సీకి అర కిలోమీటరు పరిధిలో గోషా ఆసుపతి ఉందని దాన్ని మార్చాలని జీవో రావడంతో ఆసుపత్రిని బంగారుపేట పీహెచ్‌సీగా 2014 భవనం ప్రారంభించారు. 2016లో గోషా ఆసుపత్రి నుంచి బంగారుపేటకు పూర్తిగా మార్చేశారు. 2016లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ గోషా ఆసుపత్రిని పరిశీలించి పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈక్రమంలో 2018లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అపోలో ఆసుపత్రి నిర్వాహకులను ఇక్కడికి తీసుకువచ్చి గోషా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కృషి చేశారు. అనివార్య కారణాల వల్ల కేంద్రం ప్రారంభం కాలేదు. తరువాత ప్రభుత్వం మారడంతో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా పరిశీలించి వంద పడకల ఆసుపత్రికి కృషి చేస్తామని చెప్పారు. అయితే కార్యరూపం దాల్చలేదు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని చెప్పారు. దీంతో పట్టణ ప్రజలకు ఆసుపత్రిపై ఆశలు చిగురించాయి. వెంకటగిరి నుంచి తిరుపతికి ఎంతో మంది డయాలసిస్ బాధితులు వెళ్తున్నారు. టీడీపీ ప్రభుత్వం రావడం అందునా ఎమ్మెల్యేగా కురుగొండ్ల విజయం సాధించడంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తారని మండలవాసులు ఎదురు చూస్తున్నారు.



గోషా ఆసుపత్రిలో మద్యం బాటిళ్లు, చెత్తాచెదారం

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం: విజయశ్రీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 5: ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి సూళ్లూరుపేట మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల సహకారంతో పట్టణ అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు కాకుండా ప్రభుత్వ నిధులతో సూళ్లూరుపేటను తీర్చిదిద్దుతానన్నారు. అవసరమైతే షార్ సహకారంతో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయిస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రతి ఇంటికీ నీరందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తిచేసి త్వరిత గతిన లబ్ధిదారులకు ఇవ్వాలని అధికారులను ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. అంతకుముందు మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, బీసీ సెల్ నాయకుడు పెరుమాల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ని రద్దు చేయండి



కొండుగుంట పాఠశాలలో బీటీఏ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

సూళ్లూరుపేట/ కోట/ నాయుడుపేట, జూలై 5: విద్యా విధానంలో తీసుకొచ్చిన జీవో 117ను వెంటనే రద్దు చేసి 3, 4, 5 తరగతులను హైస్కూల్ విలీనం నుంచి వెనక్కి తీసుకొచ్చి యథావిధిగా కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు శేఖర్ అన్నారు. ఫేడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తికావడంతో మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును తాజ్‌పెట్రోల్ బంకు సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవాల నేపథ్యంతో మండల స్థాయి సభ్యుడు పాల్గొనే చైతన్యం తీసుకురావాలన్నారు. కొన్ని మార్పులు తీసుకొచ్చి పాత పద్ధతిని కొనసాగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రామ్మూర్తి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని కొండుగుంట, చిట్టేడు, గూడలి, మద్దాలి, సిద్ధమ్మకండ్రిగ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం బీటీఏ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యవగళం పాదయాత్ర సందర్భంగా జీవో 117ను రద్దు చేయాలని మాజీ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆ జీవోను రద్దుచేసి ఉపాధ్యాయులకు భరోసా ఇవ్వాలని కోరారు. బీటీఏ మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ విధి విధానాలతో ప్రాథమిక విద్యా వ్యవస్థ చిన్నభిన్నం అయ్యిందని, జీవో 117ను రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. నాయుడుపేట పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటరావు , లక్ష్మీప్రసాద్, బి.బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు





నిరుపయోగంగా ఉన్న కొండూరు సంపద తయారీ కేంద్రం - మంగళంపాడు వద్ద రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

సూళ్లూరుపేట, జూలై 5: లక్ష్యం నీరుగారింది... చెత్తను ఆదాయ వనరుగా మార్చి పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో గతంలో పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. స్వచ్ఛభారత్ తోపాటు ఉపాధిహామీ పథకం నిధులను వీటి నిర్మాణానికి వినియోగించారు. ఇవి ఎలా పనిచేయాలనే విషయంపై ముందస్తు ప్రణాళికతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చారు. ఇంత చేసినా క్షేత్రస్థాయిలో ఇవి ఎక్కడా పనిచేయడం లేదు. వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా రైతులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టాలన్న ఆశయమూ నెరవేరలేదు. ఐదేళ్ల నుంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

14 కేంద్రాలూ నిరుపయోగం...

సూళ్లూరుపేట మండలంలో మొత్తం 19 పంచాయతీలకు గాను 14 సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఒక్కో కేంద్ర నిర్మాణానికి రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వెచ్చించారు. అప్పట్లోనే పంచాయతీల్లో, పొడి, తడి చెత్తను సేకరించేందుకు హరిత రాయబారులను నియమించారు. కొన్ని చోట్ల ఆరంభంలో బాగానే జరిగింది. వారికి జీతాలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెల్లింపులు జరిగాయి.

నిర్వహణ గాలికి...

2019లో ప్రభుత్వం మారిన తర్వాత వీటి నిర్వహణను గాలికొదిలేశారు. ఆదాయం సంగతి పక్కన పెడితే పలుచోట్ల ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కొన్నాళ్లు హరిత రాయబారులకు జీతాలు చెల్లించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అనంతరం పంచాయతీలే చెల్లించుకోవాలని చేతులు దులుపుకుంది.

నిధుల పక్కదారి...

గత ప్రభుత్వం ఆర్థిక సంఘ నిధులను పక్కదారి మళ్లించడంతో పంచాయతీల్లో కనీస సౌకర్యాల కల్పన కష్టమైంది. దీంతో తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యం మూలకు చేరింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తెస్తారని ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వీటిని ఆచరణలోకి తెస్తే రైతులకు కూడా ఎంతో ఉపయోగంగా ఉండటమే కాకుండా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుంది.

జామాయిల్ చెట్లపై గొడ్డలి పోటు

సంగనపల్లి, పాతనాలపాడు, కొత్తపల్లి ప్లాంటేషన్ల నుంచి స్మగ్లింగ్

డక్కిలి, జూలై 5: అటవీ ప్లాంటేషన్లలో జామాయిల్ చెట్లు నరికి అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని పాతనాలపాడు, సంగనపల్లి, కొత్తపల్లి పరిధిలో సుమారు వెయ్యి హెక్టార్లలో అటవీ శాఖ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి జామాయిల్ చెట్లను పెంచింది. కొందరు అక్రమార్కులు రాత్రి వేళల్లో వాటిని యథేచ్ఛగా నరికించి తరలించుకుపోతున్నా అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంగనపల్లి సమీపంలోని ఓ ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లు ముక్కలు ముక్కలుగా నరికి వేసి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. కొంతమంది ఎండుకట్టెల మాటున జామాయిల్ దుంగలను తరలిస్తుండగా మరి కొందరు రాత్రి వేళల్లో చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా శ్రీకాళహస్తికి చేరుస్తున్నారు. గత నెల రోజులుగా ఈ అక్రమ రవాణా సాగుతున్నట్టు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అదేవిధంగా దేవునివెల్లంపల్లిలోని జామాయిల్ ప్లాంటేషన్లలో ఎక్కువ భాగం చెట్లను నరికి తరలించడంతో అక్కడ చెట్లు కంటే నరికేసిన మొదళ్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అటవీ ప్లాంటేషన్లలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తరలించడానికి సిద్ధంగా ఉన్న జామాయిల్ దుంగలు

కలెక్టరును కలిసిన జేఏసీ నాయకులు



దొరవారిసత్రం, జూలై 5: తిరుపతి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా జేఏసీ చైర్మన్ పి.గోపినాథ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్వర్, కోశాధికారి రూప్‌చంద్, జీవన్ తదితరులు ఉన్నారు.

కోటమ్మకు సామూహిక పొంగళ్లు

కోట, జూలై 5: పట్టణంలోని కోటమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన భక్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. అమ్మవారి ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు మల్లెపూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

13న జగన్నాథ రథయాత్ర



కరపత్రాల ఆవిష్కరణలో ఇస్కాన్ ప్రతినిధులు

గూడూరు, జూలై 5: పట్టణంలో ఈనెల 13న నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో 10వ జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ప్రచార కేంద్ర నిర్వాహకుడు డాక్టర్ శుకదేవస్వామి చెప్పారు. శుక్రవారం సొసైటీ కాలనీలోని ఇస్కాన్ కేంద్రంలో రథయాత్రకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో పదేళ్లుగా పూరి తరహాలో రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐసీఎస్ రోడ్డు నుంచి ప్రారంభమై డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు వద్ద ముగుస్తుందన్నారు. రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. భానుప్రకాష్, డీవీఎస్ గిరి, రమణారెడ్డి, శేషయ్య, మయూరి శ్యామ్‌యాదవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, జూలై 5: పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. శుక్రవారం టీడీపీ నాయకుడు తానంకి నానాజీ నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పలు పరిశ్రమల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిశ్రమ ప్రతినిధులు స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో నియోజకవర్గంలో వెనుబడి ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడం, వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు



సూళ్లూరుపేట, జూలై 5: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది టెన్త్‌లో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో 500 మార్కులు పైగా సాధించిన ఎల్.అజేయ్, జయంతి, ఏ.పవన్, వి.చందన, జి.లహరికి నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలను అందజేశారు. సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఏ.అశోక్‌కుమార్ సమా పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 5: పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ... ప్రతినెలా దివ్యాంగులకు చేయూత అందిస్తున్నామన్నారు. విష్ణువందన, తనూజ, అనిత, స్నేహలత, శశిరేఖ, జానా సుధీర్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సప్లై ఛానల్‌ను పునరుద్ధరించండి

పెళ్లకూరు, జూలై 5: మండలంలోని జీలపాటూరు చెరువుకు స్వర్ణముఖి, తెలుగుగంగ ద్వారా నీరందించే సప్లై ఛానల్‌ను పునరుద్ధరించాలని సర్పంచు కె.శివకుమార్, ఆయకట్టు సంఘ చైర్మన్ ఏ.రమణయ్య సహా రైతులు జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, ఎన్‌హెచ్ఏఐ అధికారి వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పెళ్లకూరు పెట్రోల్ బంకు, చిల్లకూరు, వడ్డిపాలెం వద్ద సప్లై ఛానల్‌ను పూడ్చి వేశారన్నారు. వర్షాలు ప్రారంభం కావడం వలన సప్లై ఛానల్ ద్వారా చెరువుకు నీరందడం లేదని వాపోయారు. ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాలు సాగవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి సప్లై ఛానల్‌ను పునరుద్ధరించాలని కోరారు.

'నేను బడికి వెళ్తా' ర్యాలీ

దొరవారిసత్రం, జూలై 5: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేను బడికి వెళాత కార్యక్రమంపై అవగాహన కల్పించే దిశగా మండలంలోని సింగనాల త్తూరులో శుక్రవారం ర్యాలీ జరిగింది. ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మండల విద్యాశాఖాధికారులు మునిశేఖర్, కృష్ణయ్య ర్యాలీ చేపట్టారు.

11వ పీఆర్సీలో మోసం చేసినందుకే
జగన్‌కు 11 సీట్లు

▸▸ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్, జూలై 5: ప్రాథమిక విద్యా రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ విమర్శించారు. జగన్ తుగ్లక్ పాలనతో మొత్తం విద్యారంగమే నిర్వీర్యమైందన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు 11 సీట్లే కేటాయించారని ఎద్దేవా చేశారు. ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.117 విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చిందన్నారు. దానిని వెంటనే రద్దు చేయాలన్నారు. నాటి ప్రభుత్వ జీవోతో ఒక్కో ఉపాధ్యాయుడు 42 పీరియడ్లు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడడంతో పాటు బోధనేతర కార్యకలాపాలు పెరిగిపోయాన్నారు. టాయిలెట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి ఎన్నో యాప్‌లను ఉపాధ్యాయులే చూడాల్సిన పరిస్థితి నుంచి బయటపడేలా ప్రతి ఉన్నత పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను కూటమి ప్రభుత్వం నియమించాలని కోరుతూ ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు.

శ్రీకాళహస్తి సత్యవేదు

ధర్మరాజస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు



ధర్మరాజస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జూలై 5: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి పట్టణంలోని చెన్నైరోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు జరగనున్నాయి. ఇందు కోసం శుక్రవారం ఆలయ ఆవరణను శుభ్రం చేశారు. విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేపట్టారు. కాగా, గత పాలకులు ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో దుకాణ సముదాయ నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో అర్జున తపస్సు జరిగే ప్రదేశంలో భక్తులకు అడ్డంకి ఏర్పడింది. ఆలయంలోని ఈశాన్య భాగంలో తాటిచెట్టుపై అర్జునుడు సంప్రదాయబద్ధంగా తపస్సును ఆచరించి నిమ్మకాయలను భక్తులకు ప్రసాదంగా వెదజల్లడం అనావాయితీ. ఈ ఉత్సవానికి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. ఈ క్రతువు అనాది ఆచారంగా కొనసాగుతోంది. సరిగ్గా అర్జున తపస్సు జరిగే ప్రదేశంలో దుకాణ సముదాయం నిర్మించారు. ఇక్కడ భక్తుల తొక్కిసలాట జరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పిల్లల వసతిపై అలసత్వం తగదు



హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న గదిని పరిశీలిస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 5: పిల్లల వసతిపై అలసత్వం తగదని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న బాలుర వసతిగృహాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. 20 రోజుల క్రితం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ హాస్టల్‌ను తనిఖీ చేసి అధ్వాన పరిస్థితులను ఎండగట్టారు. మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆ తరువాత వసతిగృహంలో ఎలాంటి మార్పు వచ్చిందో పరిశీ లించేందుకు శుక్రవారం రిషితారెడ్డి వెళ్లారు. అక్కడ ఎలాంటి మార్పు లేకపోగా కొన్ని గదులు చెత్తమయంగా దర్శనమివ్వడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన

శ్రీకాళహస్తి, జూలై 5: శ్రీకాళహస్తి పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై పట్టణంలోని మోటారు తనిఖీ అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల బస్సులను నడిపే సమయంలో డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతివేగంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి వాహనంలో తప్పనిసరిగా అటెండర్ ఉండి విద్యార్థులు వాహనం ఎక్కేటప్పుడు, దిగే సమయంలో వారికి సహాయపడాలన్నారు. అలాగే వాహన కండీషన్‌ను ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

ఏర్పేడు, జూలై 5: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం పూట విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏర్పేడు ఎంఈవో ప్రేమలత అన్నారు ఏర్పేడు మండలం శివగిరి ఎస్టీకాలనీలో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగార్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లందరూ పాఠశాలలోనే ఉండాలన్నారు.కార్యక్రమంలో రాజాగంగాధర్, ఉపాధ్యాయులు కందస్వామి, సీఆర్పీలు వెంకటముని, మునీశ్వర్, గురుప్రసాద్, సురేష్, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూలై 5: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థులు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన నీలిమకు రూ.4వేలు, హిమసాగర్‌కు రూ.3వేలు, మూడవ బహుమతి హిమసాగర్‌కు రూ.2,500, ప్రత్యేక బహుమతులుగా హారిక, గంగాదేవికి రూ.2వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రాజశేఖర్, జ్యోతీరావు, సుబ్రహ్మణ్యం, గిరిధర్, మణి, మల్లికార్జున, కైలాసం రవి, హరీష్, నారాయణ, ఒమునికృష్ణ, శ్రీనివాసులు, బీఎస్ రామయ్య, ప్రత్యేక అతిథులు వెంకటకృష్ణ, ఆదిశేషు, హైమావతి, ప్రసన్న పాల్గొన్నారు.

నేడు ఉచితంగా రేబిస్ టీకాలు

శ్రీకాళహస్తి, జూలై 5: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని పశువుల ఆస్పత్రిలో శనివారం 9గంటలకు రేబిస్ నిరోధక టీకాలు ఉచితంగా వేయనున్నట్లు సహాయ సంచాలకుడు డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కుక్కల పెంపకం, వాటి ఆరోగ్య సంరక్షణపై యజమానులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, జూలై 5: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఏపీ, తెలంగాణ ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత, ఢిల్లీ రాష్ట్రపతి భవన్ జాయింట్ సెక్రటరీ మన్మీతి నంద, ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి వేర్వేరు సమయాల్లో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

వరదయ్యపాళెం, జూలై 5: వరదయ్యపాళెం మండలం పాండూరు పంచాయతీ శ్రీవెంకటేశ్వర గిరిజన కాలనీలో మాణిక్యాల బుజ్జమ్మకు చెందిన పూరిగుడిసె శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బుజ్జమ్మ కూలి పనులకు వెళ్లిన సమయంలో గుడిసెలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా. కూలికి పోతేగానీ పూట గడవని తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బుజ్జమ్మ వేడుకుంటోంది.

వైభవంగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠించి పురవిహారం చేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 5: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనక దుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూలై 5: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కానిస్టేబుల్ ఔదార్యం



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న కానిస్టేబుల్

సత్యవేడు, జూలై 5: ఇటీవల ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినికి సత్యవేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీధర్ నగదు బహుమతి అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విద్యార్థిని రూత్ వినోలియా ఇంటర్ సెంకడ్ ఇయర్ పబ్లిక్ పరీక్షల్లో వెయ్యి మార్కులకు గాను 949 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. కానిస్టేబుల్ శ్రీధర్ శుక్రవారం రూ.10వేల నగదు బహుమతిని సీఐ దివాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జగన్‌మోహనాచార్యులు ద్వారా అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్, రాజేష్, శివరామ్, దస్తగిరి, సురేష్, సలీమ్, కృష్ణవేణి, గీత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆటస్థలం పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 5: మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలకు చెందిన ఆట స్థలాన్ని ఎంఈవో రవీంద్రనాథ్, వీఆర్వో మురళి శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఆట స్థలం ఆక్రమణ నేపథ్యంలో రికార్డులను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు ఎంఈవో తెలిపారు.

పాఠశాలల తనిఖీ

శ్రీకాళహస్తి, జూలై 5: పట్టణంలోని పలు పాఠశాలలను శుక్రవారం జిల్లా సెక్టోరల్ అధికారులు, ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. పట్టణంలోని కుమారస్వామి తిప్ప ప్రాథమిక పాఠశాల, కైలాసగిరి ప్రాథమిక పాఠశాలల్లో నాడు నేడు పనులను లను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అదే విధంగా భవిత కేంద్రాన్ని సందర్శించారు. గతంలో జరిగిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో గుర్తించిన పిల్లల పేర్లను వెంటనే భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి: కలెక్టర్



విద్యార్థులతో కలిసి పాఠాలు వింటున్న కలెక్టర్ - హాస్టల్‌లో ఆహార పదార్థాల పరిశీలన

రేణిగుంట, జూలై 5: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు విభాగాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాల వసతుల గురించి ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చుని హిందీ పాఠ్యాంశాలను విన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అందిసున్న యూనిఫాం, బ్యాగ్, పుస్తకాలు తదితర వస్తువులను సత్వరమే పంపిణీ చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాఠశాలలో 480మంది విద్యార్థులు ఉండాలని, ప్రస్తుతం 430 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ హరిబాబు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అటెండెన్స్‌ను పరిశీలించిన కలెక్టర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణకు ఫోన్ చేసి గైర్హాజరు అవుతున్న విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలనని ఆదేశించారు. అనంతరం హాస్టల్‌లోని భోజన శాలలో స్టాక్ వివరాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆదేశించారు. వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేయగా ఆయన సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఆదిమూలం



రైతులకు టార్పాలిన్, డ్రమ్ములు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, జూలై 5: రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. శుక్రవారం కేవీబీపురం మండలంలోని రాయపేడులో సర్పంచు బాలాజీ ఆధ్వర్యంలో రైతులకు టార్పాలిన్లు, డ్రమ్ములు, జీలుగ, జనుము విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్నిరకాల విత్తనాలు, పనిముట్లు, యంత్రాలు సబ్సిడీతో పంపిణీ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులకు అన్యాయం చేసిందని విమర్శించారు. వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి జనుము, జీలుగ విత్తనాలు 50శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారి నీలమ్మ, టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, సర్పంచులు సురేష్, బాలాజీ, వెంకటేశులు, దొరబాబు నాయుడు, నాయకులు వెంకటకృష్ణయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మి, సాధు, జనసేన నేతలు థామస్, సురేష్‌రెడ్డి, వగత్తూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే ముద్దు

నాగలాపురం, జూలై 5: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం నాగలాపురం మండలంలోని కృష్ణాపురంలో రైతులకు టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు, జనుము, జీలగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచి జూలై ఒకటినే అందజేశారని చెప్పారు. అలాగే పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, పార్థీబన్, నెల్సన్ మండేలా, ప్రణీత్ రెడ్డి, బాలాజీ, వెంకటేష్, ఎండీ.కుమార్, రాజశేఖర్ యాదవ్, వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐ, ఎస్‌ఐలపై చర్యలు తీసుకోండి

మహిళపై దురుసుగా ప్రవర్తించారంటూ ఎస్పీకి జనసేన నాయకురాలి ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వినుత

తిరుపతి(నేరవిభాగం)/శ్రీకాళహస్తి, జూలై 5: శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహారావు, ఎస్‌ఐ అరుణపై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినుత కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ హర్షవర్ధన రాజును తిరుపతిలో కలసి ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చిన మహిళపై దురుసుగా ప్రవర్తించి.. ఏడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నారన్నారు. ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఏడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని పట్ల అమర్యాదగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని స్టేషన్‌కు వెళ్లి అడిగిన తనతోనూ సీఐ, ఎస్‌ఐలు అమర్యాదగా ప్రవర్తించారని చెప్పుకొచ్చారు. స్పందించిన ఎస్పీ తక్షణం విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె మీడియాకు తెలిపారు. అలాగే తన నియోజకవర్గంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసు అధికారులపైనా ఫిర్యాదు చేశానన్నారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ తీరు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, జూలై 5: అధికారం పోయాక మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగంరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుజ్జి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకుని గడచిన ఐదేళ్ల పాటు అక్రమాలకు పాల్పడిన జగన్ అధికారం పోయాక నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కోట చంద్రశేఖర్, మునిరాజ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, మణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

శ్రీకాళహస్తి, జూలై 5: వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇకపై ప్రతి శుక్రవారం ఉదయం పోలీసులు డ్రిల్‌కు హాజరు కావాలని ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

శ్రీకాళహస్తి, జూలై 5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శాంతిభద్రతల పరిరక్షణకు వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి కోరారు. వ్యాపారులు సమయపాలన పాటించడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా సహకరించాలని చెప్పారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF SURNAME
I, Ramineni Palakshi (Old Name) W/o Daruvuru Sankar Naidu R/o 20-49-S4-626-1, Subash Nagar, Tirupati Town, Tirupati Dist., A.P., have changed my Surname to DARUVURU PALAKSHI (New Name).
AJT - 4086

CHANGE OF NAME
I, R.V.Chenchaiah S/o R.Venkama Naidu (Old Name) R/o 1-47, Mannavaram, Srikalahasthi Mandal, Tirupati Dist., A.P., 517620 have changed my Name to RANGINENI VENKAMANAIDU CHENCHAIAH (New Name).
AJT - 4087

ప్లాట్స్ ఫర్ సేల్
5 లక్షల 9999 లకే హైవేకి ఆనుకొని తిరుపతి IISEER ప్రక్కన ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు. అయోధ్య టౌన్ షిప్ నందు కలవు. డైరెక్ట్ ఓనర్. 9502774175 / 7995992114.
AJT - 4085

CHANGE OF NAME
I, Varshini Rangineni W/o Chenchaiah Rangineni (Old Name) R/o 1-47, Mannavaram, Srikalahasthi Mandal, Tirupati Dist., A.P., 517620 have changed my Name to VARSHINI KALUVAKOLLU W/o RANGINENI VENKAMANAIDU CHENCHAIAH (New Name).
AJT - 4088

TAX CONSULTANTS
File Income Tax Returns, GST, Company Registration, ROC Fillings, Website Design, Business Registration, Vehicle Insurance, Digital Marketing at Low Prices, Call or Whatsapp 7207446677
AJT - 187457

PEST CONTROL
మీ పరిసరాలను దోమలు, బొద్దింకలు, ఎలుకలు, బల్లులు మరియు నల్లులు నుంచి సంరక్షించుకోండి. చెదల నివారణ మా ప్రత్యేకత. తిరుపతిలో 25 సం॥ పైగా ఉత్తమ సర్వీసును అందిస్తున్న మరియు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఏకైక సంస్థ. గ్యారంటీతో సర్వీసు చేయబడును. సెల్ : 9848315414
AJT - 179600

TOLET
తిరుపతి, అక్కారంపల్లి రోడ్డు, ఉపాధ్యాయ నగర్‌లో 2 BHK, 3 BHK మరియు డూప్లెక్స్ హౌస్ (ఆఫీసులకు) అద్దెకు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్ర. : 9177186787.
AJT - 4061

HOUSE FOR SALE
తిరుపతి కొర్లగుంటలోని హచ్ టవర్ పక్కన 16" అంర" (G+F+S) ఫ్లోర్లతో పడమర ముఖం గల ఇల్లు అమ్మకానికి కలదు. సం.ప్ర. సెల్: 98494 45835
AJT-10618

వంట మనిషి కావలెను
తిరుపతి పి.కె.లే అవుట్ అశోక అపార్ట్‌మెంట్‌లో వంట మనిషి (మహిళ) వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకు : 98667 26232
AJT - 187423

WANTED
తిరుపతిలో 20,000/- జీతంతో ప్రముఖ కొరియర్ కంపెనీలో ఉద్యోగావకాశము కలదు. బైక్ మరియు మొబైల్ కలిగి వుండాలి. వివరాలకు : 99855 04732, : 91775 41210.
AJT - 4084

WANTED
Wanted to HR Manager:5Y Exp, Senior Accountant:5Y Exp, Pharmasist:1Y Exp, Computer Operators:1Y Exp, work in Tirupati, Cont: megamedicals. ceo@ gmail.com
AJT-4074

ONE/TWO/SITTING
ఒకే సం//లో INTER, DEGREE, B.COM, BCA, BBA, BBM, B.SC, DIPLOMA, B.Tech, EEE, ECS, CIVIL, MAC (ALL BRANCHES), B.Ed, NURSING AARYA ONLINE COLLEGE, TPT. 93936 22612
AJT-4080

WANTED
Wanted Female Tele Callers, Salary Rs.20,000/- pm + Incentives upto Rs.25,000/-, Qua-Inter/Degree, RKC Group: 90006 37999, 88015 02343.
AJT-4076

ప్లాట్లు కొనబడును
నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, మైపాడు రోడ్ ఏరియాలోని ప్లాట్లు కొనబడును. సం.ప్ర. సెల్: 93464 48054, 79812 46665
AJR-193520

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్. షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189272

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

పుత్తూరు వార్తలు

రైలు కింద పడి యువకుడి మృతి

పుత్తూరు అర్బన్, జూలై 5: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. రేణిగుంట జీఆర్పీ పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని ఎగువ ఉత్తరపుకండ్రిగ దళితవాడకు చెందిన వడివేలు కుమారుడు నారాయణ మూర్తి(30) శుక్రవారం ఉదయం పుత్తూరు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబర్ ఒకటిపైకి వచ్చాడు. అదే సమయంలో చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చు

పుత్తూరు టౌన్, జూలై 5: రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చని ఎల్ఐసీ యూనియన్ నాయకులు అన్నారు. ఎల్ఐసీ వారోత్సవాల్లో భాగంగా కార్యాలయ ఆవరణలో శుక్రవారం తిరుపతి స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి శ్రీధర్‌బాబు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 61 మంది రక్తదానం చేయగా, బ్రాంచ్ మేనేజర్ హేమాద్రి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకటముని, అరవింద్, ఎత్తురాజులు, యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి లక్ష్మణ్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు దాసరి మునెయ్య, ఎస్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ విజయంతో అమ్మవారికి అభిషేకం



అభిషేకం అనంతరం దివ్యాంగుడు మణితో స్థానిక టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూలై 5: టీడీపీ విజయం సాధించి చంద్రబాబు సీఎంగా, నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ ఎన్నికవడంతో గేటు పుత్తూరు గ్రామదేవత గోవిందమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు వీరాభిమాని అయిన గేటు పుత్తూరుకు చెందిన దివ్యాంగుడు మణి అమ్మవారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నాడు. ఈ సందర్భంగా 10వ వార్డు ఇన్‌చార్జి డీజీ ధనపాల్ మాట్లాడుతూ దివ్యాంగుడు మణి తనకు వచ్చే సామాజిక భద్రతా పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ చంద్రబాబుపై ఉన్న అభిమానంతో పింఛన్ సొమ్ముతో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహారుద్రాభిషేకం



వడమాలపేట, జూలై 5: స్థానిక భవానీ శంకర దేవాలయంలో మహా శివుడి జన్మనక్షత్రం సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం చేశారు. రుద్ర గమకాలు పటిస్తూ, భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో మహా శివుని లింగాన్ని పూలమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మంగళ హారుతులిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

దుర్గంధ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



చెత్తబుట్టలు అందజేస్తున్న నాయకులు

వడమాలపేట, జూలై 5: గ్రామాల్లో శుభ్రతను పాటిస్తూ దుర్గంధ రహిత సమాజాన్ని నిర్మిద్దామని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సీతారామపురంలో గ్రామస్తులకు చెత్త బుట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాల దృష్ట్యా గ్రామాల్లో శుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య, పంచాయితీ కార్యదర్శి ప్రతిభారత్నం, నాయకులు గోపాల నాయుడు, దేవ, హరినాయుడు, తిరుమల నాయుడు, బాబునాయుడు, రాజేంద్ర, ఎల్లప్ప నాయుడు, రమేష్, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.